సాక్షి తిరుపతి

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



## బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. - 8లో



## బావిలో యువకుడి శవం

చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లె సమీపంలోని ఓ బావిలో యువకుడి శవం తేలియాడుతూ కనిపించింది. - 8లో



## శాస్త్రోక్తంగా అంకురార్పణ

తుమ్మలగుంటలోని కల్యాణవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. - 8లో






శ్రీవారి ఆలయంలో పుష్పాలంకరణ

# అంకురార్పణ.. విష్వక్సేనుడి వీక్షణ

వెంకన్న బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడు శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలు ధరించి ఛత్ర, తామర, మంగళ వాయిద్యాలతో భేరీ నినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో ఊరేగి, కలియుగ వైకుంఠ వాసుడికి బ్రహ్మ స్వయంగా నిర్వహించే ఉత్సవాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవదేవుడి కోవెలను ఫల,పుష్పాలతో కనువిందుగా అలంకరించారు.

– తిరుమల



తిరుచ్చిపై ఊరేగుతున్న విష్వక్సేనుడు

## న్యూస్‌రీల్

### 21వ తేదీ వరకు టెట్

**తిరుపతి ఎడ్యుకేషన్ :** జిల్లా కేంద్రంలో ఈ నెల 3వ తేదీ ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీ, సెషన్‌లో పరీక్ష సమయానికి హాజరు కావాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమని, దీనిని గుర్తుంచుకుని అభ్యర్థులు సకాంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. టెట్‌కు సంబంధించి డీఈఓ కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సందేహాల నివృత్తికి సహాయ కేంద్రంలో ఏర్పాటు చేసిన 91771 45385, 63059 60866 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని డీఈఓ కోరారు.

### 5న ఏహెచ్ డిప్లొమోలో స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి సిటీ:** ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అనిమల్ హస్బెండరీ డిప్లొమో కోర్సుకు సంబంధించిన 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి డిప్లొమో ఇన్ ఏహెచ్ కోర్సులో రెండు విడతల్లో ప్రవేశాలు పూర్తయ్యాయి. మిగిలిన సీట్ల కోసం శనివారం స్పాట్ కౌన్సెలింగ్ ప్రకియ చేపట్టనున్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు వెటర్నరీ వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

### నేడు జాబ్ మేళా

**తిరుపతి అర్బన్:** నగరంలోని గవర్నమెంట్ ఐటీఐ వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తుంచనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న నిరుద్యోగులు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరుకానున్న వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. బహుళజాతీయ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని చెప్పారు. అదనపు సమాచారం కోసం 91775 08279, 85559 72657 నంబర్లలో సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సూచించారు.

### బయోమెట్రిక్ విధానంలో గదులు కేటాయింపు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి సముదాయాల్లోని గదులను ఇకపై బయోమెట్రిక్ విధానంలో కేటాయించనునన్నట్లు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సాధారణ బుకింగ్ ద్వారా మాత్రమే ఇస్తుండగా ఇకపై బయోమెట్రిక్ ద్వారా ఇస్తామన్నారు. భక్తులు తమ వెంట ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులను తీసుకురావాలన్నారు. అప్పుడు భక్తులకు గదులు కేటాయిస్తామని తెలిపారు.

### ఆర్టీసీ బస్సు పాస్‌లకు రెండు రోజులు బ్రేక్

**తిరుపతి అర్బన్:** ఆర్టీసీ జారీ చేస్తున్న బస్సు పాస్‌లను ఈ నెల 5, 6 తేదీల్లో నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరిగి ఈ నెల 7వ తేదీ నుంచి జారీ చేస్తారని వెల్లడించారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పుల నేపథ్యంలో రెండు రోజులు పాసుల జారీ ఆపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల బస్సు పాస్‌లతోపాటు ఆర్టీసీ జారీ చేస్తున్న అన్ని బస్సు పాస్‌లకు రెండు రోజులు బ్రేక్ పడిందని చెప్పారు. ఈ విషయాన్ని అంతా గుర్తించాలని స్పష్టం చేశారు.

మత్తు బాల్యాన్ని చిత్తు చేస్తుంది. సరదా వాడకం చివరకు వారి జీవితాలను నరక ప్రాయంగా మారుస్తుంది. బంగారు భవితను నాశనం చేస్తుంది. నిండు జీవితాలను పాతాళానికి తీసుకెళుతుంది. కన్నతల్లిదండ్రులకు అంతులేని ఆవేదన మిగుల్చుతుంది. సమాజాభివృద్ధికి తోడ్పాల్సిన రేపటి పౌరులను సంఘ అశాంతికి కారకులుగా మారుస్తుంది. ఆ వ్యసనం కారణంగా చిన్నారులు నేరగాళ్లుగా మారుతున్న తీరు ఆందోళన కలిగిస్తుంది.



# బతుకు..బానిషా



గంజాయి పీల్చే ప్లాస్టిక్ బాటిల్

- మత్తుకు బానిసలవుతున్న చిన్నారులు
- పెడతోవపడుతున్న పిల్లలు
- మాదకద్రవ్యాల వినియోగంలో మైనర్లే ఎక్కువ
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న నేరాలు

**పలమనేరు:** విద్యార్థులు చేజేతులా జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి, హాన్స్, సిగరెట్లు ఇతరత్రా మత్తు పదార్థాలకు అలవాడు పడుతున్నారు. ఇటీవల కొందరు విద్యార్థులు గంజాయి మత్తుకు అలవాటు పడి, అవి దొరకనప్పుడు రంగుల్లో వాడే టిన్నర్లు, గమ్ములు, వైట్‌నర్లు, నెయిల్‌పాలిష్, కొన్ని రకాల దగ్గు మందులు, ఎనర్జీ డ్రింక్స్ పేరిట రూ.20 కే లభ్యమవుతున్న కూల్‌డ్రింక్స్‌లోకి హాన్స్ పొడి వేసుకుని తాగేస్తున్నారు. ఎక్కువగా గంజాయి సిగరెట్లు, ఖాళీ ప్లాస్టిక్ కూల్‌డ్రింక్ బాటిల్‌కు రంధ్రం పెట్టి, అందులోకి పైపు పెట్టి గంజాయి వేసి బాటిల్ పైభాగంలో నోరు, ముక్కు ద్వారా పీల్చడం చేస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో గంజాయి చాక్లెట్లు సైతం బయటపడిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల బెల్లంలో గంజాయి కలిపి బెల్లం చాకెట్ల పేరిట సైతం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

### అనుమానం రాకుండా విక్రయాలు

వైజాగ్, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి రకరకాల మార్గాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు గంజాయి వచ్చి చేరుతోంది. ఆయా ప్రాంతాల్లోని కీలక వ్యక్తులు సరుకును తీసుకుని, దాన్ని ఏజెంట్లకు విక్రయిస్తారు. వారు సిగరెట్లు, బీడీలు, ప్యాకెట్లుగా మార్చి వారికి ఉన్న నెట్‌వర్క్ ద్వారా మత్తుకు అలవాటు పడిన వారికి రహస్యప్రాంతాల్లో అందిస్తుంటారు. మత్తుకు అలవాటు పడిన వారు ఎక్కడ కలుస్తుంటారు ? సరుకు ఎక్కడ ఇవ్వాలి తదితరాలన్నీ రహస్యంగా సాగుతుంటాయి. ఇటీవల పలమనేరుకు చెందిన కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులు వైజాగ్ నుంచి బైక్‌లపై గంజాయి తెస్తూ ఇక్కడి ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. అనుమానం రాకుండా కొందరు మహిళలు పట్టణాల్లోని నివాసాల్లో కావాల్సిన వారికి సరుకును అమ్ముతున్నట్టు తెలుస్తోంది.

### మత్తుకు అలవాటు పడిన వారి లక్షణాలిలా...

ముఖ్యంగా మత్తుకు అలవాటు పడిన మైనర్లు ఇంట్లో ముభావంగా ఉండడం, నిర్లక్ష్యంగా ప్రవర్తించడం చేస్తుంటారు. పెద్దలు, తల్లిదండ్రులపై గౌరవం ఉండదు. తరచూ ర్యాష్‌గా చూడడం, ఎదురు తిరగడం, దాడికి దిగడం లేదా వారికి వారే చేతులు కోసుకోవడం లాంటివి చేస్తుంటారని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా జుట్టు పెంచుకోవడం, ఎక్కువగా స్నేహితులతో గడపడం, సమయానికి ఇంటికి రావపోవడం తదితర లక్షణాలను కలిగి ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

### ఇటీవల జరిగిన కొన్ని ఘటనలివీ..

- తిరుపతికి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు గత నెల 24వ తేదీన గంజాయి మత్తులో ఓ వృద్ధురాలి మెడలో చైన్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. కిందపడి వృద్ధురాలు మృతి చెందగా నేరస్తులుగా మారిన మైనర్ల జీవితాలు ప్రశ్నార్థకరంగా మారాయి.
- చిత్తూరుకు చెందిన ఓ ఎనిమిదో తరగతి బాలుడు తల్లిదండ్రుల మాట వినకుండా ఇంట్లో ముభావంగా ఉంటూ బడికెళ్లనంటూ మారాం చేశాడు. ఓరోజు బాలుడి బ్యాగులో గంజాయి ప్యాకెట్ దొరకడంతో తల్లిదండ్రులు అతడిని ప్రశ్నించగా ఓ అన్న ఇచ్చాడని, తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగడంతో వారు మానసిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.
- పలమనేరు పట్టణానికి చెందిన ఓ బాలుడు ఇంట్లో దాచిన టిన్నర్, వైట్‌నర్‌ను గమనించిన తల్లిదండ్రులు పిల్లాడి ఫ్రెండ్స్‌ను ఆరాతీయగా, వాడు దూరంగా వెళ్లి వాటిని నోట్లో పెట్టి లాగుతుంటాడని చెప్పడంతో హతాశులయ్యారు. దీంతో బాలుని తండ్రి నిత్యం కొడుకు వెళ్లే స్కూల్ వద్ద నిఘా పెడుతున్నాడు.
- పలమనేరు పట్టణంలో కొందరు పిల్లలు గంజాయిని పైపులో కూరి కూల్‌డ్రింగ్ బాటిళ్లతో పీల్చుతుండగా అక్కడున్న పశువుల కాపరి వారించినందుకు అతనిపై దాడికి దిగారు. దీంతో అతను పారిపోయాడు.
- తాజాగా పలమనేరు పట్టణంలో మైనర్లు ఇరువర్గాలుగా రోడ్డుపైనే దాడులు చేసుకున్నారు. వీరిలో చాలామంది మత్తుకు అలవాటు పడిన వారుగానే చెబుతున్నారు.
- మత్తుకు బానిసలైన వారు రాత్రిపూట బైక్‌లపై వెళ్లే వారిని ఆపి, అటాక్ చేసి బంగారు చైన్లు లాక్కోవడం లేదా వారిని కొట్టి బైక్‌ను తీసుకెళ్లడం లాంటివి జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి.
- నిర్మానుష్యమైన రహదారుల్లో బైక్‌పై వెళ్లేవారిని లిఫ్ట్ అడిగి వెనుక నుంచి బ్లేడ్‌తో కోయడం లాంటి ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి.
- మత్తు పదార్థాల కోసం సెల్‌ఫోన్లను చోరీ చేయడం, లేదా ఇంట్లోని సామగ్రిని తాకట్టు పెట్టడం, లోన్‌యాప్‌లో అప్పులు, బైక్‌ల చోరీలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



ఇటీవల పోలీసులు సీజ్ చేసిన గంజాయి చాక్లెట్లు(ఫైల్)



గంజాయి సిగరెట్లు

### ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడంటే..



గంజాయి సిగరెట్లు


తిరుపతి పట్టణంలోని నివాస ప్రాంతాలు, రేణిగుంట బైపాస్ రోడ్డు, రైల్వేస్టేషన్, క్రికెట్ గ్రౌండ్లతోపాటు కొన్ని రహస్య ప్రదేశాల్లో వీరు గంజాయిని పీల్చుతున్నట్టు తెలిసింది. ఇక చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు తదితర పట్టణాల్లోనూ కొన్ని ఆవాస ప్రాంతాలు వీరికి అడ్డాలుగా మారాయి.

### “ చిన్నపిల్లలే అలవాటు పడ్డారు



పట్టణాల్లో చిన్న పిల్లలే గంజాయికి అలవాటు పడ్డారు. వీరు నిత్యం కొన్ని రహస్య ప్రాంతాలకు చేరుకోవడం.. అక్కడ మత్తులో జోగడం కనిపిస్తోంది. వారిని చూసి స్థానికులు సైతం భయపడుతున్నారు. ఇటీవల రెండు వర్గాలు రోడ్డుపై గొడవలు పడ్డాయి. ఇరువర్గాల్లో చిన్నపిల్లలే ఉన్నారు. కొట్టుకుంటూ దుస్తులు చించుకుంటూ రక్తం కారుతున్నా రెచ్చిపోయారు. ఈ ఘటన చూసిన వారికి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారే అని బాధ పడ్డారు. – **సేటు, పలమనేరు**

### తల్లిదండ్రుల నిర్లక్ష్యం



ఇటీవల మైనర్లు మత్తుకు బానిసవడం చూస్తే బాధేస్తోంది. మత్తులో వారు ఏం చేస్తున్నారో వారికే అర్థం కావడం లేదు. ఇలాగే వదిలేస్తే క్రిమినల్స్‌గా మారడం ఖాయం. ముఖ్యంగా బడికెళ్లే పిల్లలు సైతం మత్తుకు అలవాటున్న వారితో స్నేహం చేస్తున్నారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లగానే ఏం చేస్తున్నారు ? వారి ప్రవర్తన ఎలా ఉందని తల్లిదండ్రులు కనిపెట్టాలి. వారి నిర్లక్ష్యంతోనే పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు.

– కృష్ణమూర్తి రెడ్డి, ప్రిన్సిపల్, పలమనేరు



# అశ్వియాగ్రహం

సంచలనం రేకెత్తించిన పుంగనూరు పట్టణానికి చెందిన చిన్నారి అశ్వియఅంజుమ్ హత్యపై ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. చిన్నారిని హత్యను చేసిన నిందితులను ఉరి తీయాలని, ఎన్‌కౌంటర్ చేయాలని అన్ని వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారి అశ్వియ హత్యను నిరసిస్తూ గురువారం రాత్రి పుంగనూరు పట్టణ ప్రజలు, హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని తూర్పుమొగశాల వద్ద గల చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా వచ్చి గోకుల్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం చిన్నారి అశ్వియ చిత్రపటానికి నివాళులర్పిస్తూ, కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారిని హత్య చేసిన నిందితులను ఉరి తీయ్యాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు ఐకమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. హంతకులను పట్టుకునేంత వరకు సంఘీభావం ప్రకటిస్తామని తెలిపారు. – పుంగనూరు



చిన్నారి అశ్వియ మృతికి నివాళులు అర్పిస్తున్న ప్రజలు



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పుంగనూరు వాసులు (ఇన్‌సెట్) అశ్వియకు న్యాయం చేయాలని ప్లకార్డుతో చిన్నారి

# పింఛన్లకు 2,948 మంది దూరం

**చిత్తూరు కలెక్టరేట్ :** తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 2,948 మంది ఎన్టీఆర్ భరోసా పింఛను నగదు తీసుకోలేదు. అక్టోబర్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండు జిల్లాలో నిర్వహించారు. అయితే రెండు జిల్లాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించిన దాఖలాలు లేవు. ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నామని హడావుడి చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లే దు. కూటమి నేతలు తమ ప్రగల్భాల కోసం పింఛన్ల ఇళ్లకే వెళ్లి పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఏమాత్రం కనిపించడం లే దు. చిత్తూరు జిల్లాలో 2,68,877 మంది పింఛను లబ్ధిదారులున్నారు. ఇందులో ఈ నెల 3వ తేదీ అధికారిక నివేదికల ప్రకారం 2,67,496 (99.49శాతం) మందికి పింఛన్లు అందజేశారు. మిగిలిన 1,384 మందికి పింఛను నగదు అందించలేకపోయారు. అలాగే తిరుపతి జిల్లాలో 2,66,342 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో 2,64,778 (99.41 శాతం) మందికి పింఛను నగదు అందించారు. మిగిలిన 1,564 మంది పింఛను నగదు పొందలేకపోయారు. కాగా పింఛన్ల పంపిణీ 2 రోజులు మాత్రమే నిర్వహించడంతో రెండు జిల్లాల్లో 2,948 మంది పింఛన్లు పొందలేకపోయారని పలువురు వెల్లడిస్తున్నారు.

## క్లుప్తంగా

### మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



**చంద్రగిరి:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని నరసింగాపురం సమీపంలో ఉన్న స్వర్ణముఖినది నుంచి ఇసుకను రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు



లారీ కింద చిక్కుకుపోయిన ద్విచక్రవాహనం

**నాగలాపురం:** మండలంలోని కృష్ణాపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు నుంచి చెన్నైకు తాడు లోడ్‌తో ఓ లారీ బయలుదేరింది. తాడు లారీ కృష్ణాపురం మలుపులో వెళుతుండగా చెన్నై నుంచి మరో లారీ ఎదురుగా వచ్చింది. ఈ క్రమంలో పుత్తూరు నుంచి వెళుతున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. చెన్నై నుంచి వస్తున్న లారీ, తాడు లారీని తప్పించబోయి. పిచ్చాటూరు నుంచి కారూరుకు వెళ్లడానికి షణ్ముగం(50), ఆయన కుమార్తె ప్రయాణిస్తున్న బైకును ఢీకొన్నాడు. అయితే లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో మోటారుసైకిలిస్టు, అతని కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే ద్విచక్రవాహనం మాత్రం లారీ కింద చిక్కుకుని, నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారమందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి కారణమైన లారీని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ తెలిపారు.

### నేడు ఎంబీయూలో మోహనమంత్ర-2024

**చంద్రగిరి:** మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో మోహన మంత్ర-2024 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి సుమారు 20 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజులు పాటు వివిధ సాంస్కృతిక, స్పోర్ట్స్, టెక్నోహాలిక్ కార్యక్రమాలతో పాటు లైవ్ బ్యాండ్, డీజే నైట్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు హాజరుకానున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- టీటీడీ ఈఓ శ్యామలరావు

**తిరుమల:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీలోని అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం ఈఓ, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు రద్దు చేసినట్లు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 7 లక్షల లడ్డూలను నిల్వ ఉంచామన్నారు. 8వ తేదీ గరుడ సేవ రోజు బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేశామన్నారు. దాదాపు 1,250 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, 3900 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించామన్నారు. ఆలయ మాడ వీధులు,



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

ఇతర ప్రాంతాల్లో 2,775 సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామని చెప్పారు. లక్షలాది భక్తులు వాహనసేవలు వీక్షించేందుకు తిరుమలలో ఎల్‌ఈడీ స్క్రీన్లు 9 రోజుల పాటు 28 స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుమలలోని బాలాజీనగర్, కౌస్తుభం ఎదురుగా, రాంభగీచా బస్టాండ్, ముళ్లగుంత, తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ , శ్రీవారి మెట్టు వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. తిరుమలలో సామాన్య భక్తుల కోసం 6,282 గదులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విఐపీ ఏరియాలో 1,353 గదులు అందుబాటులో ఉన్నాయన్నారు.

**వాహనసేవల వేళలిలా..**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుందని ఈఓ తెలిపారు. గరుడవాహన సేవ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. అక్టోబర్ 4న సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. 5వ తేదీ తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక రూ.13.45 కోట్లతో నూతనంగా నిర్మించిన వకుళమాత కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు.

పీఏసీ -1, 2, 3, 4లోని మొత్తం 28 హాళ్లలో దాదాపు 6700 లాకర్లు ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అదనంగా 600 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించామన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లు, అన్నప్రసాదం, పాలు, అల్పాహారం వితరణకు ఏర్పాట్లు చేమాని చెప్పారు. భక్తులకు వైద్యసేవలందించేందుకు తిరుమలలోని అశ్విని ఆస్పత్రి, వైకుంఠం క్యూకాంప్లెక్సుల్లోని వైద్యకేంద్రాలు, 6 డిస్పెన్సరీల్లో అదనపు సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. తిరుమలలోని జీఎన్‌సీ, సీఆర్వో, ప్రధాన కల్యాణకట్ట, భజనమందిరం, ఏటీసీ సమాచార కేంద్రాలతో పాటు ఈ ఏడాది అదనంగా పీఏసీ-2, వీజీఓ కార్యాలయం సమీపంలో, రాంభగీచ అతిథి గృహం వద్ద, మ్యూజియం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా టీటీడీకి సంబంధించిన సమాచారాన్ని కరపత్రాలలో ముద్రించి భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. శ్రీవారి సేవకులు తిరుమలలోని అన్ని విభాగాల్లో భక్తులకు సేవలందిస్తారన్నారు. తిరుమలలో ఆస్థానమండపం, నాదనీరాజనం, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణి వద్ద ఆధ్యాత్మిక, ధార్మిక ఉపన్యాసాలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జేఈఓలు గౌతమి, వీర బ్రహ్మం, సీవీఎస్‌ఓ శ్రీధర్, సి సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

### 18 కిలోల గంజాయి స్వాధీనం

వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

**వెంకటగిరి(సైదాపురం):** ఒడిశా నుంచి చెన్నైకు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 18 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో వద్ద బుధవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించామని తెలిపారు. చెన్నైకు చెందిన షేక్ కైఫ్ అనుమానస్పదంగా కనిపించారన్నారు. అతన్ని విచారించి తనిఖీలు చేయగా రూ.1.98 లక్షలు విలువ గల 18 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశామన్నారు. అలాగే అతడి నుంచి రెండు సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ సుబ్బారావు, ఏఎస్‌ఐ బీవీ రమణ, కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న ఉత్సవాలకు 404 బస్సులు

- నేటి నుంచి 9 రోజులు ప్రత్యేక సర్వీసులు
- బ్రహ్మోత్సవాల్లో 545 మంది ఆర్టీసీ ఉద్యోగులు

**తిరుపతి అర్బన్:** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 404 సర్వీసులు నడపనున్నామని కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి వెల్లడించారు. తిరుపతిలోని తమ చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 340 డీజిల్ సర్వీసులు, 64 విద్యుత్ బస్సులను కేటాయించామని తెలిపారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్లు, డీఎం హోదా కలిగిన 32 మంది అధికారులను ఉత్సవాల్లో ఆర్టీసీ సర్వీసులను పర్యవేక్షించడానికి నియమించామని చెప్పారు. 200 మంది డ్రైవర్లు, 180 మంది కండక్టర్లు, 115 మంది సెక్యూరిటీ సిబ్బంది, 50 మంది డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ, సూచనలు చేయడానికి మెకానిక్‌లను నియమించామన్నారు. మరోవైపు తమిళనాడు నుంచి 150 ప్రత్యేక సర్వీసులు తిరుపతికి, తిరుపతి నుంచి 150 ప్రత్యేక సర్వీసులు తమిళనాడులోని వివిధ ముఖ్యమైన ప్రాంతాలకు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలోని సర్వీసులే కాకుండా పొరుగు జిల్లా నుంచి 72 సర్వీసులను తెప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు చెందిన ఆర్టీసీ కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈడీ, ఆర్టీసీ అధికారులు

| ప్రయాణికులు సంప్రదించాల్సిన నంబర్లు | |
|---|---|
| తిరుపతి డిపో | 9959225670 |
| అలిపిరి డిపో | 9959225671 |
| మంగళం డిపో | 7893723453 |
| తిరుమల డిపో | 9959225672 |
| తిరుపతి ప్రత్యేక అధికారి | 9959225662 |

**ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఘాట్‌రోడ్డులో డ్రైవర్లు ఓవర్ టేక్ చేయకూడదని వెల్లడించారు. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే సమయంలో ఒకటి, 6, 8, 11వ కిలోమీటర్‌లోని మలుపులు ప్రమాదకరంగా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తిరుపతికి వచ్చే ఘాట్‌లో 1, 2, 3, 7, 12, 30, 38, 58 మలుపులు ప్రమాదకరమైనవిగా గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.

### యంత్రాలు వినియోగిస్తే చర్యలు



చిట్టిచెర్లలో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ

**భాకరాపేట :** ఉపాధి హామీ పనుల్లో యంత్రాలు వినియోగిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ హెచ్చరించారు. గురువారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో నేరుగా మాట్లాడారు. పనుల వద్ద వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు కూలీలతోనే చేయించాలని చెప్పారు. ఉపాధి పనులు కూలీలకు కాకుండా ఎక్కడైన యంత్రాలు ఉపయోగించినట్లు తెలిసినా, పాత పనులకు మెరుగులు పెట్టినా శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల భవనాలు ఖాళీ చేయబోం

**తిరుపతి లీగల్ :** స్థానిక కోర్టు ఆవరణలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల భవనాలు పరిస్థితి బాగా లేదని ఆ భవనాలను ఖాళీ చేసి, మరొక చోటకు వెళ్లాలంటూ ఉన్నత న్యాయస్థానాల సూచనను తాము అంగీకరించమని తిరుపతి న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి గోపీచంద్ అధ్యక్షతత వహించారు. ప్రస్తుతం జూనియర్ జడ్జి కోర్టుల భవనాలను ఖాళీ చేసి, మరో ప్రాంతంలో భవనాలను అద్దెకు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు, జిల్లా కోర్టు న్యాయవాదులకు సూచించింది. దీనిపై న్యాయవాదులు మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు, అదనపు జిల్లా జడ్జి కోర్టుల భవనాలు మాత్రం ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో విధులు నిర్వహించి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తే న్యాయవాదులు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తుందని పలువురు న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్ని కోర్టు భవనాలను ఇతర ప్రదేశాలకు మార్చాలని కోరారు. ప్రస్తుతం ఉన్న భవనాలను తొలగించి, నూతన భవనాలను నిర్మించాలని న్యాయవాదులు సంయుక్తంగా డిమాండ్ చేశారు. న్యాయవాదుల ఏకగ్రీవ తీర్మానాన్ని ఉన్నత న్యాయస్థానాలకు పంపాలంటూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇటీవల న్యాయవాది అప్పిలి ఉమాపతితో తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అమర్యాదగా వ్యవహరించారంటూ అతను న్యాయవాదుల అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు మాత్రం న్యాయవాదులు విధులకు హాజరు కాకూడదని తీర్మానించారు. ఈ సమావేశంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఎస్వీ వైద్య కళాశాలలో స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**తిరుపతి తుడా:** ఎస్వీ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు గురువారం స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్ పోటీలను ఎస్వీ వైద్య కళాశాల క్రీడా మైదానం, వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానం, అగ్రికల్చర్ కాలేజ్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ పోటీల్లో సుమారు 15 వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలల నుంచి 300 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, అధికారులు

పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ ఫహీమ్, డాక్టర్ త్రిమూర్తులు, ఫిజికల్ డైరెక్టర్ శరవణన్, భాను ప్రకాష్, పీఆర్వో వీరకిరణ్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

**తిరుపతి కల్చరల్:** అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ హెచ్చరించారు. నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం చిత్తూరు ఉమ్మడి జిల్లాల యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈనెల 10వ తేదీ నాటికి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతోందన్నారు. మేనిఫెస్టోలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి మూడు నెలల సమయం చాలని ప్రకటించిన పాలకులు ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారానికి కనీసం ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ జేఏసీని పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు జరపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11.500 వేతనం ఇస్తుంటే తెలంగాణలో రూ.13,650 వేతనం చెల్లిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్.జ్యోతి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌యాప్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, నాయకులు పి.వెంకటరత్నం, శోభ, ఆర్.వెంకటరత్నం పాల్గొన్నారు.





మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

**వెంకటగిరిరూరల్:** ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన తాము ప్రేమించుకుంటున్నామని, తమ ప్రేమను పదిలం చేసి, తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమ జంట గురువారం వెంకటగిరి పోలీసులను ఆశ్రయించింది. బాధితుల కథనం మేరకు.. వెంకటగిరి పట్టణం బొప్పాపురం గ్రామానికి చెందిన తుపాకుల నరసింహులు, సైదాపురం మండలం దేవర వేమూరికి చెందిన శైలజతో ఏడాది కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. దీంతో వారి ప్రేమకు హద్దులు లేకుండా పోయింది. 6 నెలల కిందట రాపూరు మండలంలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద కలుసుకుని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో శైలజ బుధవారం నరసింహులు ఇంటికి చేరుకుంది. శైలజ ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ తెలియలేదు. గురువారం వెంకటగిరి పట్టణం బొప్పాపురంలోని నరసింహులు ఇంటి వద్ద శైలజ ఉందన్న సమాచారంతో వెంకటగిరికి చేరుకున్న శైలజ కుటుంబ సభ్యులు శైలజ, నరసింహులపై దాడికి యత్నించా రు. దీంతో భయాందోళన చెందిన ఆ ప్రేమజంట తమ ప్రేమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆశ్రయించింది. గాయాలతో ఉన్న శైలజ, నరసింహులకు తొలుత ప్రథమ చికిత్స చేయించు కోవాలని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. దీంతో వా రు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.



పోలీసుస్టేషన్‌లో ప్రేమజంట

## బావిలో యువకుడి శవం

- చంద్రగిరికి చెందిన హేమంత్‌గా గుర్తింపు

**చంద్రగిరి:** మండలంలోని బుచ్చినాయుడుపల్లి శివారులోని ఓ బావిలో యువకుడి శవమై కనిపించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతుల కుమారుడు హేమంత్(22) ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. 30వ తేదీన యథావిధిగా విధులకు వెళ్లిన హేమంత్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హేమంత్ కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో గురువారం బుచ్చినాయుడుపల్లెకు చెందిన మునిరత్నం నాయుడు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి మోటారు వేసేందుకు బావిలో చూడగా యువకుడు మృతి చెందినట్లు గమనించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలోని మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించగా హేమంత్‌గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హేమంత్ అనుప్పల్లి పంచాయతీ రేకలచేనుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నడుపుతున్న నేపథ్యంలో ఆమెను కలిసేందుకు ఐదు రోజుల క్రితం ఆమె ఉన్న గ్రామానికి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా ఆమె మరిది పత్తార్ల జగదీష్, హేమంత్‌పై దాడి చేసి, సెల్ ఫోన్, ద్విచక్రవాహనం లాక్కొన్నాడు. అప్పటి నుంచి హేమంత్‌ను తరచూ బెదిరిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో హేమంత్ కనిపించకపోవడంతో బుధవారం మృతుడి తల్లిదండ్రులు మహిళతో వాగ్వివాదానికి దిగినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో 30వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన హేమంత్ చివరగా తన స్నేహితుడిని కలిసి జగదీష్ వేధింపులను వివరించాడు. ఆపై అతను కనపించకుండా పోయాడు. ఈ క్రమంలో గురువారం బావిలో శవమై తేలాడు. అసలు జగదీష్‌ది ఆత్మహత్యా..హత్యా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళతోపాటు ఆమె మరిదిపై అనుమానం ఉన్నట్లుగా మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



బావిలో శవమై తేలియాడుతున్న హేమంత్

## వైభవంగా కలశ ప్రతిష్ట

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట చేశారు. దీంతో దసరా ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో కలశాన్ని ప్రతిష్ఠించారు. విశేష పూజలు నిర్వహించి, కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, ఓంశక్తి నామస్మరణల నడుమ కలశంతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అలాగే నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు అష్టబంధన పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు పలు రకాల సుగంధ ద్రవ్యాలు, చందనం, పసుపు, పంచామృతం, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు.



పూజలు చేస్తున్న అర్చకులు

### చెంగాళమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం



**సూళ్లూరుపేట:** చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ సహాయ కమిషనర్, ఈఓ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఏ ర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారి ఎదుట కలశస్థాపన చేశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కాళంగినదిలోని పవిత్ర జలాలను మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి కలశాల్లో నింపి, పూజలు చేశారు. వేద పండితులు కలశాల్లోకి నవదుర్గలను ఆవాహన చేసి, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత బీరక రాంబాబు, శాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి, అఖండజ్యోతిని వెలిగించారు. అనంతరం కలశస్థాపన చేసి, ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. మొదటి రోజున సాయంత్రం చెంగాళమ్మ తల్లికి పుట్టినిల్లు అయిన గొల్లలములువు గ్రామస్తులు సారె సమర్పించి, పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు యాగశాలలో చండీయాగం చేశారు. ఈ యాగానికి విశాఖపట్నం నగరానికి చెందిన పి నాగేశ్వరరావు, రాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారికి పరమేశ్వరి అలంకాం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ అలంకారానికి చెన్నైకు చెందిన శింగన ఓబుల్‌రెడ్డి, పద్మజారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా అంకురార్పణ

- తుమ్మలగుంటలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- అంకురార్పణకు హాజరైన చెవిరెడ్డి దంపతులు

**తిరుపతి రూరల్:** తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు గురువారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. తెల్లవారు జామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, కొలువు, పంచాంగ శ్రవణం, మూలవర్లకు అభిషేకం చేశారు. పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం వైఖానస ఆగమోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని జరిగిన అంకురార్పణ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు హాజరై పూజాదికాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పర్యవేక్షణ చేయడానికి శ్రీవారి సర్వసేనాధిపతి విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై గ్రామంలో ఊరేగారు.

**నేడు ధ్వజారోహణం**

ధ్వజారోహణంతో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య కన్యాలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల కారణంగా ఆలయంలో జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు, ప్రత్యేక పూజలను రద్దు చేశారు.





తిరుచ్చిపై విష్వక్సేనుడు, విష్వక్సేనుడు ఊరేగింపులో పాల్గొన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

**వాహన సేవల వివరాలివీ**

ఈ నెల 4వ తేదీ ధ్వజారోహణం, పెద్దశేష వాహన సేవలు జరుగుతాయి. 5న చిన్నశేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహన సేవ జరుగుతుంది. అలాగే ఈనెల 8వ తేదీన ఉదయం పల్లకి ఉత్సవం(మోహినీ అవతారం), రాత్రి గరుడ వాహన సేవ జరుగుతుంది. 9న హనుమంత వాహనం, స్వర్ణరథం, గజవాహనం, 10న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వవాహన సేవ నిర్వహిస్తారు. 12వ తేదీ చక్రస్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.